

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
సోమవారం 2 జూన్ 2025 - పేజీలు 8



రేషన్ బియ్యం ఇకనుంచి రేషన్ దుకాణాల్లోనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆదివారం ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతినెలా 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్ణయించిన సమయాల్లో రేషన్ బియ్యం ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, తెదేపా నాయకులు, అధికారులు సంయుక్తంగా ఆదివారం ఈ విధానాన్ని ప్రారంభించారు. ఇకనుంచి బియ్యం సరఫరా చేసే వాహనాలు కనుమరుగవుతాయి. దీనిపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల ద్వారా బియ్యం కార్డుదారులకు పంపిణీ చేస్తే పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దీంతోనే ఈ విధానంలో మార్పులు తెచ్చింది. వాహనాలను రద్దు చేయడం పట్ల వైసిపి, తెదేపా నాయకుల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. వైసీపీ నేతలే వాహనాలను తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారని తెదేపా నాయకులు, మళ్లీ రేషన్ షాపులను తెరిచి అక్రమాలకు పాల్పడేందుకు తెదేపా నాయకులు ప్లాన్ చేశారంటూ వైకాపా నేతలు ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నారు. అయితే పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం ఈసారి రేషన్ షాపులపై పెద్ద ఎత్తున నిఘా ఉంచారు. ఇది సక్సెస్ అవుతుందా లేదా అనేది వేచి చూడాలి..

– గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

- వైసిపి, తెదేపా నేతల మధ్య మాటల యుద్ధం
- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన రేషన్ బియ్యం దుకాణాలు
- అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని చెబుతున్న పౌరసరఫరాల శాఖ



# రేషన్ విషయంలో.. ప్రజలు ఏమనుకుంటున్నారు..!



ఏపీలో రేషన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం మార్చింది ఇంటింటికీ వాహనాల ద్వారా వచ్చి సరుకుని సరఫరా చేసే దానిని మార్చి ఇక మీదట చౌక దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని చెప్పింది. ఏపీలో రేషన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం మార్చింది ఇంటింటికీ వాహనాల ద్వారా వచ్చి సరుకుని సరఫరా చేసే దానిని మార్చి ఇక మీదట చౌక దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని చెప్పింది. ఆ మేరకే కీలక నిర్ణయం తీసుకుంది. దానినే అమలు చేస్తోంది. జూన్ 1 నుంచి రేషన్ సరకులను చౌక దుకాణాల వద్దనే పంపిణీ చేయడమే కాదు దానిని ఆర్భాటంగా మంత్రులు ఎమ్మెల్యేలు అంతా ప్రారంభించారు. ఇక చౌక దుకాణాల వద్దనే తిరిగి రేషన్ సరకులు పంపిణీ ఎందుకు అన్న దానికి కూటమి చెప్పే కారణాలు వారికి ఉన్నాయి. ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ సరకు సరిగ్గా అందడం లేదని కేవలం తూతూ మంత్రంగా ముప్పయి శాతం మాత్రమే అందిస్తూ మిగిలిన దానిని పక్క దాని పట్టిస్తున్నారు అని విమర్శిస్తున్నారు. బియ్యం అక్రమంగా తరలిపోతోందని దాని వల్ల చాలా మంది రేషన్ తీసుకునే లబ్దిదారులకు న్యాయం జరగడం లేదని అంటున్నారు. అంతే కాదు ఎపుడు వస్తారో ఎపుడు ఎక్కడ వాహనాలు నిలుపుతారో తెలియదని కచ్చితమైన సమయాలు ఉండవని, అలాగే ప్రతీ నెలలో కూడా ఈ విధంగానే చేస్తూ అక్రమాలకు తెర తీసే విధంగా ఈ విధానం ఉందని అంటున్నారు. రేషన్ బియ్యం పెద్ద ఎత్తున ఏపీ నుంచి అక్రమ తరలింపు వెనక ఈ లోపభూయిష్ట విధానం ఒక ప్రధాన కారణం అని అంటున్నారు. ఈ కారణాలతోనే తిరిగి పాత విధానాలను అమలు చేస్తున్నామని చెబుతున్నారు. అయితే ఇంటింటికీ రేషన్ సరకులు ఇచ్చే దానిని రద్దు చేసి ఒక మంచి సేవను జనాలకు దూరంగా చేశారు అని వైసీపీ ఆరోపిస్తోంది. దీని మీద వైసీపీ అధినేత జగన్ అయితే చంద్రబాబు మీద విమర్శలు గుప్పించారు. ఇదే నా మీ విజన్ ప్రశ్నిస్తున్నారు. తాను పాదయాత్ర సమయంలో జనాల కష్టాలను కళ్ళారా చూసి వారి కోసం ఈ విధానం అమలు చేశామని ఆయన చెప్పారు. దీని వల్ల వృద్ధులు మహిళలు వికలాంగులు అంతా ఎంతో ఉపశమనం పొందుతూ వచ్చారని ఆయన అంటున్నారు. రేషన్ వాహనాల తొలగింపుతో ఏకంగా 20 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆయన ఆరోపించారు. వారంతా బీసీ ఎస్సీ ఎస్టీలు ఇతర బలహీన వర్గాలు అని ఆయన అంటున్నారు. మొత్తం మీద చూస్తే రేషన్ సరుకు ఇంటింటికీ సరఫరా చేసే తమ విధానం బాగుందని వైసీపీ అంటూంటే ఆ విధానం తప్పుల తడక కాబట్టే తాము పాత విధానం పునరుద్ధరించామని టీడీపీ కూటమి అంటోంది. సరే ఈ రెండు వాదనలు పక్కన పెడితే జనాలు ఏమి అనుకుంటున్నారు అన్నదే ఇక్కడ ముఖ్యం. జనాలు అయితే భిన్నంగా స్పందిస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో మైదాన ప్రాంతాలలో ఉన్న లబ్దిదారులు అయితే తమకు సమీపంలో రేషన్ దుకాణం ఉండడంతో తమ పనులు చూసుకుని రోజులో ఎపుడో ఒకపుడు రేషన్

మిగతా 3వ పేజీలో

# ఎమ్మెల్సీ ఆలపాటిపై కుట్ర బహిర్గతం..

**వంకాయలపాటి కిడ్నాప్ డ్రామా ఫెయిల్**
**రాజకీయ అరాచక శక్తుల కుట్రే..!**
**సంబంధం లేని వ్యవహారంలో ఆలపాటిని ఇరికించే ప్రయత్నం చేస్తారా?**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

విద్యా రంగంలో వేలాది నిరుపేద విద్యార్థులకు విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై కుట్రపూరితంగా తప్పుడు కిడ్నాప్ ఆరోపణలు చేసిన శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ కుట్ర బహిర్గతమైంది. రాజకీయ అరాచకశక్తుల ప్రేరణతో ఆయన ఈ నాటకాన్ని రచించి, స్వయంగా నటించి తన అసలు రూపాన్ని బయటపెట్టుకున్నాడు. ఆదివారం ఆలపాటి కార్యాలయం విడుదల చేసిన వీడియోలు, ఆడియోలు ఈ కుట్రను విపులంగా ఎక్స్‌పోజ్ చేశాయి. శుక్రవారం కిడ్నాప్‌కు గురైనట్లు పోలీసులకు, మీడియాకు సమాచారం ఇచ్చిన వంకాయలపాటి శ్రీనివాస్ వాస్తవానికి ఆ రోజు కన్నా రెండు రోజుల ముందే ఆలపాటి ఇంటికి వచ్చి మాట్లాడదామని స్వయంగా చెప్పాడు. మహానాడు కార్యక్రమం నిమిత్తం కడపలో ఉన్న ఆలపాటి, గుంటూరు వచ్చాక కలుద్దామని తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఎన్ఆర్ఐ సంస్థ నుండి గుంటూరుకు వెళ్తున్న ఆలపాటి సిబ్బంది వాహనంలోనే శ్రీనివాస్ స్వచ్ఛందంగా వెళ్లాడు. తన సౌలభ్యం కోసం ఆలపాటి సిబ్బంది వాహనంలోనే వెళ్లి, ఆలపాటి కార్యాలయంలో కూర్చొని మాట్లాడుతున్న సమయంలోనే, తనే కిడ్నాప్‌కు గురైనట్లు తన సన్నిహితులతో మీడియాకు, పోలీసులకు సమాచారం ఇచ్చేలా కుట్ర చేసినట్లు ఆలపాటి కార్యాలయం చెబుతోంది. ఆ రోజు ఆయన స్వచ్ఛందంగా ఆలపాటి కార్యాలయానికి వచ్చి, ఆఫీసులో నేరుగా కూర్చొని, తన తండ్రి పేరున కళాశాల కమిటీకి

మిగతా 3వ పేజీలో





# పారదర్శకంగా బియ్యం అందజేయాలి

- రేషన్ డీలర్లకు కలెక్టర్ ఆదేశం
- దుకాణాల్లో నేటి నుంచి రేషన్ పంపిణీ
- రోజుకు రెండు పూటలా ప్రతినెల 15వ తేదీ వరకు పంపిణీ చేయాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

చౌక ధర దుకాణాల్లో ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రైస్ కార్డుదారులు వీలున్నప్పుడు నిత్యావసర సరుకులు తెచ్చుకునే అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ.భార్గవ తేజ తెలిపారు. ఆదివారం తూర్పు నియోజకవర్గం

మిగతా 3వ పేజీలో

## రెండు పూటలా రేషన్ పంపిణీ : ఎమ్మెల్యే బూర్ల



**గుంటూరు, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి నెల 15వ తేదీ వరకు ఉదయం సాయంత్రం రెండు పూటలా రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు నగర శివారు 47వ డివిజన్ పరిధిలో రేషన్ దుకాణం ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత వైసిపి ప్రభుత్వం వాహనాల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అభాసుపాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెస్ట్ తహసిల్దార్ వెంకటేశ్వరరావు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన : ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగు రాళ్ల పట్టణంలోని 20వ వార్డులో నూతనంగా ప్రభుత్వ చౌకధర దుకా ణాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ కొత్త శిరీష , టీడీపీ ఇన్చార్జి గోళ్ళ కిరణ్‌తో కలిసి ప్రారంభిం చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో అనాలోచితంగా వ్యవహరించి వెహికల్స్ పెట్టి రూ.1200 కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసిందన్నారు. దీనివలన ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందన్నారు. ఇంటి వద్దకే రేషన్ అంటూ వెహికల్స్ పెట్టినప్పటికీ సక్రమంగా ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. దీనివలన రేషన్ సక్రమంగా పంపిణీ జరగలేదన్నారు. ఈ వాహన వ్యవస్థను రద్దుచేసి రేషన్ దుకాణం వద్దనే రేషన్ ఇచ్చే విధంగా జూన్ 1వ తేదీ నుంచి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్నటువంటి రేషను కార్డుదారులకు సక్రమంగా అందేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రతి డీలర్ పై ఉందన్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఈ వాహన మూలంగా రేషన్ సక్రమంగా పంపిణీ చేయలేకపోయారన్నారు. ఆర్డీవో మురళి కృష్ణ మాట్లాడుతూ రేషన్ షాపులు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8:00 వరకు సమయపాలన పాటించాలన్నారు. రేషన్ డీలర్లు కార్డుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు కార్డుదారులకు సక్రమంగా రేషన్ అందివ్వాలని ఆయన కోరారు. అలాజరగని పక్షంలో ఏ విధమైన అవతవకలకు పాల్పడినా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, టీడీపీ రూరల్ అధ్యక్షుడు గండికోట వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తురక వీరస్వామి, డాక్టర్ ఉన్న నాగ మల్లికార్జునరావు, తహసిల్దార్ మధుబాబు, సుతారు నాగమల్లేశ్వరరావు, నడికుడి వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్ అలీ, వడ్డుపల్లి సాంబశివరావు, జనసేన నాయకులు కామిశెట్టి రమేష్, దూదేకుల కాసిం సైదా, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కారు సైదా, చౌక ధరల దుకాణం డీలర్ సుతార్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## 10 శాతం అమలు చేయలేక రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన ప్రభుత్వం..

**డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్**



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వము అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం అవుతున్నప్పటికీ ఇచ్చిన హామీలలో 10% కూడా అమలు చేయలేక రాష్ట్రం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైసీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మకు వందనం పేరుతో తల్లులను, ఆడబిడ్డ నిధి అంటూ 18 సంవత్సరాలు నిండిన మహిళలను, యువగళం పేరుతో యువతను, అన్నదాత సుఖీభవ అంటూ రైతులను , ఫ్రీ బస్ పేరుతో ఆడపడుచులను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆయన విమర్శించారు. గతంలో సుగాలి ప్రీతి అంశంలో ఊగిపోయిన పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం అయినా ఆ కేసును పట్టించుకోవడం లేదంటే ఇది వెన్నుపోటు కాదా అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం అంటూ తిరుపతి లడ్డు విషయంలో పాప ప్రక్షాళన పేరుతో గుడి మెట్లు తుడిచిన పవన్ కళ్యాణ్ అదే తిరుపతిలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో తొక్కిసలాట జరిగి భక్తులు మృతి చెందితే ఎందుకు పాప ప్రక్షాళన చేయలేదు ఇది భక్తులకు మీరు చేసిన వెన్నుపోటు కాదా అని ప్రశ్నించారు.

# త్వరలో అన్ని ప్రాంతాల్లో యోగా కేంద్రాలు

**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రానున్న కాలంలో నలువైపులా యోగా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆశయ సాధనలో భాగంగా యోగాంధ్రప్రదేశ్-2025 లక్ష్యంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి రామచంద్రప్రభు హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగా గురువు జుజ్జూరు శ్రీనివాసరావు యోగాసనాలు వేయించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని, అందుకే యోగాకు ప్రాముఖ్యత మరింతగా పెరుగుతోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య నిపుణులు, వైద్యులు యోగాను ఒక సమగ్ర ఆరోగ్య సాధనంగా చెబుతున్నారని అన్నారు. యోగా అనేది కేవలం ఆరోగ్యానికే కాదని, మానసిక ప్రశాంతతకూ మార్గమని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, ఆనందం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాలు యోగా చేయడం వల్ల నిద్రలేమి, మానసిక ఒత్తిడి, అధిక రక్తపోటు వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందన్నారు. ఇటీవల కాలంలో యువత కూడా యోగాపై ఆసక్తి చూపుతున్నారని, ఇది సంతోషకరమని పేర్కొన్నారు.

# లబ్ధిదారులకు గౌరవంగా సరుకులందిస్తాం : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గతంలో మాదిరిగా లబ్ధిదారులకు గౌరంగా రేషన్ దుకాణాల వద్దే నిత్యావసర సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 9, 10,12, 56వ వార్డుల్లోని రేషన్ దుకాణాల్లో నిత్యావసరాల పంపిణీని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 65 ఏళ్లు పైబడిన వృద్ధులు మరియు దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 29,760 రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. ప్రతి రేషన్ దుకాణం వద్ద సరుకుల వివరాలు మరియు ధరలతో కూడిన బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన మొబైల్ డెలివరీ ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. వాహనాలు వచ్చిన సమయానికి పనులు మానుకుని వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదని వివరించారు. ఇకపై లబ్ధిదారులకు వీలున్న సమయంలో దుకాణాల వద్ద రేషన్ సరుకులు తీసుకోవచ్చని సూచించారు. ప్రజలకు పారదర్శంగా సరుకులు పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, మీరావలి, చిష్టి, జాగర్లమూడి శ్రీనివాస్, అల్లం బాజీ, గాలి సతీష్ , అబ్దుల్ సలీం, గుడిపల్లి వాణి, హాఫీజ్, ఇద్రి సాయి, కందుకూరి వెంకట్, ఐలా శ్రీనివాస్, మాదాసు శేఖర్, వేములకొండ శ్రీను, వంగర ఏడుకొండలు, కొండేపి శేఖర్, పాటిబండ్ల బలరాం, నాగేశ్వరరా%జ%వు, గుడిపల్లి నవీన్, బద్రి, అర్వపల్లి శీను తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలు సాధించేంత వరకు పోరాడుతాం

- గోడపత్రికలో ఆవిష్కరణ
- సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల




**పెదకాకాని మేజర్ న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం గోడ పత్రిక ఆవిష్కరణ చేయడం జరిగినది ఈ సందర్భంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు,పల్లెలలో మూడు సెంట్లు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే పట్నాలలో రెండు సెంట్లు,పల్లెలో మూడు సెంట్లు ఇవ్వటంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇవ్వడమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసి, జీవో విడుదల చేయటం జరిగిందన్నారు.ఆ జీవో ప్రకారం అర్హులైన నిరుపేదలకు పల్లెలలో మూడు సెంట్లు పట్నాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు పెరిగిన గృహోపకరణాల ధరలను దృష్టిలో ఉంచుకొని గృహనిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం పెదకాకాని తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అర్హులైన అర్జీదారులు మండల కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటల కుమారి, గుంటూరు జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని ఆగస్టిన్,దర్శి లింగారావు కె. శ్రీనివాసరావు,కోటేశ్వరరావు,బి.మోజెస్ బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : యాగంటి



**మాచర్ల మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. ఆదివారం పట్టణం లోని 9, 13,15 వార్డులలో ప్రభుత్వ రేషన్ దుకాణాలను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ వాహనాల పేరుతో భారీ కుంభకోణానికి పాల్పడిందని విమర్శించారు. ప్రతినెల వాహనాలలో రేషన్ పంపిణీ పేరుతో ఒకటి రెండు రోజులు హడావిడి చేసి పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించారు అన్నారు. పేద ప్రజలకు తీవ్రస్థాయిలో అన్యాయం చేశారని తప్పుపట్టారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రతినెల సమయానుకూలంగా రేషన్ దుకాణాలు తెరిచి ప్రజలకు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన రేషన్ దుకాణాలను తిరిగి తెరవడం సంతోషకరమని పేర్కొన్నారు. రేషన్ దుకాణాలకు రాలేని వృద్ధులు,వికలాంగులకు రేషన్ దుకాణం నిర్వాహకులే ఇంటికి వెళ్లి సరుకులు ఇస్తారన్నారు. రేషన్ సరుకులు వద్దన్నవారికి నేరుగా డబ్బులు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గతంలో కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాలు అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రతిపక్ష పార్టీ అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని హర్షం వ్యక్తం చేశారు. మూడు వేలుగా ఉన్న పింఛన్లను 4000 కు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. త్వరలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. బళ్ళు తెరిచేలోపే తల్లికి వందనం డబ్బులు తల్లులు ఖాతాల్లో జమ అవుతాయని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, వీఆర్వో నాగేశ్వరరావు, మంజుల వెంకటేశ్వర్లు,, బండ్ల బ్రహ్మం, తిక్క కొండలు,గోలి వెంకటేశ్వర్లు, భవానీ బాయ్ చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

# ఈత నేర్చుకునేందుకు మెరుగైన అవకాశాలు : సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి




**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** స్విమ్మింగ్ పూల్ లో ఈత నేర్చుకోవడానికి పిల్లలకు అనేక అవకాశాలు ఈరోజు అందుబాటులోకి వచ్చాయని సీఐడీ ఎస్పీ కె చక్రవర్తి అన్నారు. గత నెల నాలుగో తేదీ నుండి 31వ తేదీ వరకు అమరావతి కరకట్ట సమీపంలోని ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ప్రాంగణం సమీపంలో కృష్ణ నదిలో పిల్లలకు ఈత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఐడీ ఎస్పీ చక్రవర్తి మాట్లాడుతూ గోకరాజు గంగరాజు గెస్ట్ హౌస్ స్విమ్మింగ్ ఫుల్ ఈత నేర్చుకునే అవకాశం రావడం తల్లిదండ్రులు తమ పిల్లల అదృష్టంగా భావించాలన్నారు. స్విమ్మింగ్ ఫుల్ లో బేసిక్ టెక్నిక్స్ నేర్చుకున్న పిల్లలను ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలోని కృష్ణా నదిలో ఈత నేర్పించడం చాలా గొప్ప విషయమన్నారు. ఓపెన్ వాటర్ లో ఈత కొట్టటానికి, స్విమ్మింగ్ లో ఈత కొట్టటానికి చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. ఓపెన్ వాటర్ లో ఈత ప్రాక్టీస్ చేయటం వల్ల సముద్రంలో కూడా స్విమ్మింగ్ చేయవచ్చని తెలిపారు.తాను రామేశ్వరం లోని ధనుష్కోటి నుండి శ్రీలంక వరకు 36 కి.మి. స్విమ్మింగ్ చేసిన అనుభవాన్ని వివరించారు. గోకరాజు గంగరాజు సారథ్యంలో ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ పిల్లలకు ఈత నేర్పించడం ద్వారా సమాజానికి సేవ చేయడం గొప్ప విషయమన్నారు. అధ్యక్షులు ఎల్ రామకృష్ణ మాట్లాడుతూ గంగరాజు అసోసియేషన్ కు కృష్ణా నది ప్రక్కన ఒక ప్లాట్ దానం చేయటం వల్ల ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించబడిందని తెలిపారు. అయితే స్విమ్మింగ్ ఫూల్ బాగా చిన్నదైనందున తమ గెస్ట్ హౌస్ లో అంతర్జాతీయ స్థాయి లో ఉన్న స్విమ్మింగ్ ఫూల్ లో పిల్లలకు ఉచితంగా ఈత శిక్షణా శిబిరము నిర్వహించేందుకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. 215 మంది పిల్లలకు ఈతలో శిక్షణ ఇచ్చామని చెప్పారు. అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా మాట్లాడుతూ తాను, తన కుమారుడు కలిసి సేవ్ ప్యూర్ వాటర్ ఇన్ సీస్ అనే కాన్సెప్ట్ తో ఐదుగురు సభ్యులతో కలిసి రామేశ్వరం నుండి శ్రీలంక వరకు 36 కి.మీ. ఈత కొట్టామని గుర్తు చేసారు. ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ లో ట్రైనింగ్ కోసం తాను హైదరాబాద్ నుండి ఆక్వా డెవిల్స్ కు వచ్చేవారమని, ఆక్వా డెవిల్స్ వారందించిన సహకారం మరువ లేనిదని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఆక్వా డెవిల్స్ సభ్యులు , సీనియర్ అడ్వొకేట్ వెలగా సురేష్ విజయకృష్ణా సూపర్ బజార్ చైర్మన్ గా పదవి భాధ్యతలు స్వీకరించిన సందర్భముగా చిరుసత్కారం చేసారు. ఈ ఈత శిక్షణా శిబిరము లో శిక్షణ పొందిన పిల్లలకు పోటీలు నిర్వహించి వారికి , ఐలాండ్ వరకు ఈతకొట్టిన పిల్లలకు సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. వాలంటరీగా పిల్లలకు ఈత నేర్పించిన అసోసియేషన్ సభ్యులకు , కార్యక్రమము నిర్వహణకు సహకరించిన డోనర్స్ కు మెమెంటోలు , గిఫ్టులు అందజేశారు. కార్యక్రమం లో కార్యదర్శి యార్లగడ్డ వెంకట రమేష్, ఉపాధ్యక్షులు జి.సాంబశివ రావు, సహాయ కార్యదర్శులు ఎ.రామిరెడ్డి, జి.జనార్దనరావు, కోశాధికారి కె.వి.రామయ్య, ఈవెంట్ కన్వీనర్ సిహెచ్. జోజిబాబు, మాజీ అధ్యక్షులు కె.యస్. రామచంద్రరావు, వెలగపూడి వేంకటేశ్వరరావు , మందపాటి నరసరాజు, కమిటీ సభ్యులు , అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా బియ్యం అందజేయాలి

(మొదటి పేజీ తరువాయి)



పరిధిలో వసంతరాయపురం లోని చౌక ధరల దుకాణం నెం. 61 ను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ తేజ పునః ప్రారంభించి, రైస్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ తేజ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుంచి రైస్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణాల నుంచి పంపిణీ చేయడం పునః ప్రారంభించడం జరుగుతుందన్నారు. చౌక ధర దుకాణంలో ప్రతి నెల 15వ తేదీ వరకు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, సాయంత్రం 04.00 గంటల నుంచి రాత్రి 08.00 గంటల వరకు రైస్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైస్ కార్డుదారులు వారికి వీలున్న సమయంలో చౌక ధరల దుకాణం కి వచ్చి సరుకులను తీసుకువెళ్ళ వచ్చు అన్నారు. చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుంచి అవసరమైన అన్ని కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అన్ని దుకాణాల్లో ఈ - పోస్ మిషన్లు, వేయింగ్ మిషన్లు సర్వీసింగ్ చేసి పూర్తిస్థాయిలో సిద్ధం చేశామని, దుకాణాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని చౌక ధరల దుకాణాల్లో సరుకుల పునఃపంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని సరుకుల పంపిణీని పరిశీలిస్తున్నారన్నారు. వసంతరాయపురంలోని చౌక ధరల దుకాణంలో రైస్ కార్డుదారులకు సరుకుల పంపిణీ విధానాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ - పోస్ మిషన్ ద్వారా రైస్ కార్డుదారుల అథెంటిఫికేషన్ తీసుకొని బ్లూటూత్ అనుసంధానమైన వేయింగ్ స్కేల్ ద్వారా ఖచ్చితమైన తూకంతో సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. చౌక ధర దుకాణాలు ప్రతి నెల 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని రైస్ కార్డుదారులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని వారికి వీలున్న సమయంలో నిత్యవసర సరుకులు తీసుకొని వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రముని, తూర్పు మండల తహశీల్దార్ మహబూబ్ సుభాని, సి ఎస్ డి టి భాస్కర్, చౌక ధరల దుకాణం నిర్వహకులు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం విజయవంతం



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ,మైభారత్ గుంటూరు డిపార్ట్మెంట్ ఆఫ్ స్పోర్ట్స్,సబ్ సెంటర్ పల్నాడు జిల్లా సంయుక్త అద్వర్యంలో ఫిట్నెస్, వెల్ నెస్, పర్యావరణ పరిరక్షణ థీమ్ తో ఆదివారం నాడు కోడెల శివప్రసాద్ స్టేడియంలో జరిగిన సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం విజయవంతమైంది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా హాజరైన గుంటూరు జిల్లా డీఏడీవో నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజలలో ముఖ్యంగా యువతలో ఫిట్నెస్ పై అవగాహనా పెంచేందుకై ఫిట్ ఇండియా మూవ్మెంట్లో భాగంగా ఈ ఆదివారం సైకిల్తో అనే కార్యక్రం దేశవ్యాప్తం 25 వ సారి నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమం ఆరోగ్యకర జీవన విధానంకు సైకిల్ వాడకం సహరించడమే కాకుండా, కాలుష్యం తగ్గి పర్యావ రణం మెరుగుపడటానికి ఎంతో దోహద పడుతుందని అన్నారు.నరసరావుపేట ముఖ్య వీధులలో సైకిల్ తొక్కుతూ యువత ఉత్సహంగా పాల్గొన్న పల్నాడు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అథ్లెటిక్ కోచ్ మద్దాల సైదారావు,బాస్కెట్ బాల్ కోచ్ చావా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## రేషన్ విషయంలో ప్రజలు ఏమనుకుంటున్నారు..!

(మొదటి పేజీ తరువాయి)

సరకులు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం పెట్టిన విధానమే బాగుంటుంది అని అంటున్నారు. వాహనాలలో డోర్ డెలివరీ అంటున్నా అవి వీధి చివరలోనే నిలిపి ఉంచేవారు కాబట్టి దాని వల్ల పెద్దగా లాభం లేదని పెదవి విరిచేవారూ ఉన్నారు. ఒక వేళ ఆ సమయానికి కనుక తాము వెళ్ళకపోతే మాత్రం రేషన్ సరుకు కోసం ఇబ్బంది పడేవారమని కూడా చెబుతున్నారు. అందువల్ల వారంతా కూటమి తెచ్చిన ఈ విధానానికే మద్దతుగా నిలుస్తున్నారు. అయితే ఏజెన్సీ ప్రాంతాల వారు, అలాగే సదూరమైన గ్రామాలలో ఉండేవారు మాత్రం రేషన్ వాహనాల ద్వారా సరుకులు తమ సమీపంలోకి తెచ్చి పంపిణీ చేస్తే బాగుంటుంది అని అంటున్నారు. రేషన్ దుకాణాలకు తాము రావాలంటే దూరాభారాలు అని అంటున్నారు. అలా జనంలో దీని మీద భిన్నమైన వాదనలు ఉన్నాయి. ప్రభుత్వం అయితే ఎక్కడ రేషన్ దుకాణాలు దగ్గరగా లేవో చూసి వాటిని ఏర్పాటు చేస్తే మేలుగా ఉంటుంది. అలా కాకపోతే వాహనాలను ఆ ప్రాంతాలకు పంపిస్తే కూడా బాగుంటుంది అని అంటున్నారు. ఏది ఏమైనా రేషన్ దుకాణం అన్నది ఒక చిరునామాగా ఉండాల్సిందే అని అంటున్నారు. అదే సమయంలో రేషన్ డీలర్ల మీద పర్యవేక్షణ లేకపోతే మళ్ళీ జనాల ముంచి ఇబ్బందులు విమర్శలు వస్తాయని కూడా అంటున్నారు.

## ఎమ్మెల్సీ ఆలపాటిపై కుట్ర బహిర్గతం..

(మొదటి పేజీ తరువాయి)

సంతకం చేయిస్తానని, కొంత డబ్బు అడిగిన మాటలు స్పష్టంగా వీడియోల్లో కనిపిస్తున్నాయి. అయినప్పటికీ, అదే సమయంలో బయటకెళ్లి తనే కిడ్నాప్‌కు గురయ్యానంటూ డ్రామా అల్లాడు.వంకాయలపాటి ప్రవర్తన పూర్తిగా ముందుగానే పన్నిన కుట్రలా స్పష్టమవుతోంది. ఆలపాటి కార్యాలయంకు వారి సిబ్బంది వాహనంలోనే వస్తానని చెప్పి, వెళ్లిన శ్రీనివాస్, ఆలపాటితో మౌఖికంగా మాట్లాడే సమయంలో "ఇంకొంచెం అమౌంట్ ఏర్పడితే మా నాన్నతో సంతకం చేయిస్తా" అని చెప్పిన మాటలు వీడియోలో స్పష్టంగా ఉన్నాయి. మరీ కిడ్నాప్ అని ఎలా చెబుతాడు? ఈ ప్రశ్న వీడియో చూసిన ప్రతి ఒక్కరికి స్ఫురిస్తుంది. వీడియోల్లో కిడ్నాప్‌కు గురైన వ్యక్తిగా చెబుతున్న శ్రీనివాస్, స్వచ్ఛందంగా వచ్చినట్లు పోలీసులకు చెబుతూ, డబ్బులు డిమాండ్ చేస్తూ, స్నాక్స్ తింటూ కనిపించడం హాస్యాస్పదంగా మారింది. దీనిపై హిందూస్థాన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తీవ్రంగా స్పందించి, మీడియాను మోసం చేసిన వంకాయలపాటిపై చర్యలు డిమాండ్ చేసింది.ప్రిన్సిపాల్ పదవిని దుర్వినియోగం చేస్తూ, కాలేజీ ఆస్తులపై పెత్తనం కోసం ప్రయత్నిస్తున్న శ్రీనివాస్ గతంలోనూ అనైతిక ప్రవర్తనలకు పాల్పడ్డాడని, వ్యభిచార కేసులోనూ ఉన్నాడని ఉద్యోగుల సంక్షేమ పార్టీ నేత వడ్లమూడి వెంకటేశ్వర్ ఆరోపించారు.ఆలపాటిని డబ్బులు కావాలని పదే పదే డిమాండ్ చేసిన వీడియోలు బయటపడ్డాయి. వాటిలో "తప్పు నాదే సర్... మా నాన్నతో సంతకం చేయిస్తా, మరింత అమౌంట్ ఏర్పాటు చేయండి" అంటూ శ్రీనివాస్ మాట్లాడిన దృశ్యాలు కుట్రకు తేలికపాటి సాక్ష్యాలుగా నిలిచాయి.వీడియో రికార్డింగ్‌లు, ఆడియో క్లిప్పింగ్స్ %-% అన్నీ కలిపి చూస్తే, వాస్తవంగా ఎలాంటి కిడ్నాప్ జరగలేదని, ఇది పూర్తిగా స్క్రిప్టెడ్ డ్రామా అని స్పష్టమవుతోంది. ఈ వ్యవహారంలో ఆలపాటి నిర్భయంగా స్పందిస్తూ సత్యాన్ని వెలుగు లోకి తెచ్చారు. తాను ఎవరినీ బెదిరించలేదని, తనపై పెట్టిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని వివరించారు.సంక్షిప్తంగా చెప్పాలంటే%ౕ% ఈ డ్రామా చివరకు ఆడినవాడినే మింగేసింది. తన స్వార్థం కోసం తప్పుడు కథలు అల్లిన వంకాయలపాటి శ్రీనివాస్ కుట్ర బహిర్గతమైంది. ప్రజల ముందే కాదు, చట్టం ముందూ నిలవలేని ఈ డ్రామా ఆలపాటి రాజేంద్రప్రసాద్ సత్య నిష్ఠలకు నిదర్శనంగా నిలిచింది. అసత్యం ఎంత గొప్పగా ముస్తాబయినా చివరకు సత్యమే గెలుస్తుంది అనే వాక్యానికి మరోసారి ముద్రపెట్టిన సంఘటనగా ఇది చరిత్రలో నిలుస్తుంది.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు నరేంద్ర**



**పెదకాకాని మేజర్ న్యూస్:** ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. 14, 15 వార్డుల పరిధి నందు ఏర్పాటుచేసిన రేషన్ సరుకుల పంపిణీ దుకాణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. డోర్ డెలివరీలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందునే పాత పద్ధతి ద్వారా రేషన్ సరుకులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఒకటో తేదీ నుంచి 15వ,తేదీ వరకు ప్రతిరోజు ఉ.గం 7 గంటల నుంచి మధ్యాహ్నం గం. 12 ల వరకు సాయంత్రం గం. 4ల నుంచి గం. 8ల వరకు రేషన్ సరుకులను డిపోల ద్వారా అందజేస్తారని పేర్కొన్నారు. కార్డుదారులు వారికి కుదిరిన సమయంలో వెళ్లి సరుకులను అందుకో వచ్చునని అన్నారు. దివ్యాంగులు, 65 సంవత్సరాలు పైబడిన వారికి నేరుగా ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేస్తారని తెలిపారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అహల్య బాయి జయంతి



**మేడికొండూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని పాలడుగు గ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ లోకమాత అహల్య బాయి 300 జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు చెరుకురు తిరుపతిరావు, కొత్తూరు వెంకట సుబ్బారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మహారాష్ట్రలో హిందూ ధర్మ పరిరక్షణ ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు, బీజేపీ మండల అధ్యక్షులు ఎస్ కే భాష, పాలడుగు గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు ఆమతి వెంకటరమణ గారు, బూత్ అధ్యక్షులు నరసింహారావు, శాఖమూరి కృష్ణారావు శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు, చల్లా రోసి రెడ్డి గారు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు, మరియు మేడికొండూరు మైనార్టీ మండల అధ్యక్షులుగా మసీదు జిక్రియ నియమితులైయారు, మరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ శాఖలో చేసిన సేవలు అభినందనీయం



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో వివిధ హెూదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా చేసిన సేవలు అభినంద నీయమని సహెూ ద్యోగులు కొనియాడారు. ఆదివారం హెూటల్ గ్రాండ్ వెంకటేష్ లో పదవీ విరమణ సందర్భంగా నల్లదల తారక రామారావును సత్కరించి, సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988 నుండి 1990 వరకు టెక్నికల్ వర్క్ ఇన్స్పెక్టర్ గా పని చేశారని, ప్రమోషన్ లో భాగంగా 1990 నుండి 2025 వరకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా ఉద్యోగం చేశారని తెలిపారు. తోటి ఉద్యోగులతో 37 సంవత్సరాలుగా కలిసిమెలిసి, ఎంతో సహకరించారని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే యరపతినేని





**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐదవ సారి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 128 మంది లబ్ధిదారులకు కోటి 26 లక్షల రూపాయలు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ సక్రమంగా వచ్చిన పాపాన పోలేదన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చినప్పటికీ తక్కువ మొత్తంలో కొన్ని రకములైన చికిత్సలకు మాత్రమే వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో 5వ సారి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. గురజాల నియోజకవర్గంలో ఆదివారం రోజున 26 మంది లబ్ధిదారులకు రు 43, 80, 552 ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన గువ్వల రఘువీరారెడ్డి లివర్ సమస్యతో బాధ పడుతుంటే రూ. 10 లక్షల రూపాయల చెక్ మంజూరు చేయటం జరిగింది. పిడుగురాళ్లకు చెందిన నల్లమేకల గురవమ్మ కు రూ. 4 లక్షలు, దాసరి అయ్యప్ప బూదవాడ మూడు లక్షలు, రూపాయలు ఇలా 26 మందికి రూ. 43 లక్షల 80 వేల 552 రూపాయల చెక్కులు మంజూరు చేయటం జరిగింది.గురజాల నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ హాస్పటల్లో చికిత్స చేయించుకుని, ఆర్థిక స్తోమత లేక చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న పేద ప్రజలకు బాసటగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు బాసటగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి సహాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 4న జరిగే "వెన్నుపోటు దినం" నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి : అంబటి మురళీకృష్ణ




**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పొన్నూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సన్నాహక (జూన్ 4న జరగబోవు "వెన్నుపోటు దినం") సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని గాలి వదిలేసి చంద్రబాబు చేసిన మోసాలు,అరాచకాలు, అన్యాయాలపై పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4వ తేదీన తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు తదనంతరం పోస్టర్ ఆవిష్కరణలో చేసారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతీన మహేష్, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మోదుగుల వేణుగోపాల్ రెడ్డి , జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతి రెడ్డి వేమారెడ్డి , తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబు, ప్రతిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బాలసాని కిరణ్ కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల ప్రజా సేవకుడు గుత్తికొండ ధనుంజయరావు

**జన్మదిన వేడుకల్లో ప్రముఖుల అభినందనలు**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర చేనేత నాయకులు గుత్తికొండ ధనుంజయరావు నిబద్ధత గల ప్రజాసేవకుడని ఆంధ్ర నాట కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మంగళగిరి నాంచారమ్మ ప్రాంగణంలోని భావనారుషిస్వామివారి దేవస్థానం వద్ద మంగళగిరి సాహితీ కళావేదిక కోకన్వీనర్ గోలి మధు ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ధనుంజయరావు పుట్టిన రోజు వేడుకలలో మాట్లాడారు... మంగళగిరి బుద్ద విహార వ్యవస్థాపక అధ్యక్షులు రేఖ కృష్ణార్జునరావు మాట్లాడుతూ రాజకీయ సేవలో నాలుగు దశాబ్దాలకు పైగా ఒక నిబద్ధతగా నిలకడగా సేవలందించటం అభినందనీయ మన్నారు.. మరో పక్క వివిధ ప్రజా సంఘాలు, కళా సాంస్కృతిక రంగాల పై ఉన్న మక్కువతో గత కొన్ని సంవత్సరాలుగా మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గా కళా, సాంస్కృతిక రంగాలను ప్రజలకు దగ్గర చేయడంలో ముందున్నారన్నారు... పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు స్వర్గం పుల్లారావు మాట్లాడుతూ.. ధనుంజయరావు మంగళగిరి నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న చేనేత కమ్యూనిటీ కి చెందిన పేదలను ఆదుకోవటంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారని, తను నమ్ముకున్న పార్టీకి అంకితభావంతో గత 43 సంవత్సరాలుగా సేవలందించడం అభినందనీయ మన్నారు. పుట్టినరోజు సందర్భంగా గోలి మధు ఏర్పాటు చేసిన కేకును గుత్తికొండ ధనంజయరావు విజయ దంపతులు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోలి మధు ప్రముఖ చిత్రకారుడు దాకోజు శివప్రసాద్ (తెలుగుదేశం పార్టీ లోగో సృష్టికర్త)తో స్వయంగా గీసిన ఫొటోను ధనుంజయరావుకు బహుకరించారు.. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని శాలువాలు పూల, బొకేలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నాదుల వరప్రసాదరావు (మనీ) పిరమిడ్ ధ్యాన గురువు ఆకురాతి శంకరరావు, మార్కండేయ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవాధ్యక్షులు జొన్నాదుల బాబు శివప్రసాద్ మంగళగిరి పట్టణ పద్మశాలియ బహుతమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు చింత క్రింది కనకయ్య, దామర్ల కుబేర స్వామి, కోశాధికారి గంజి రవీంద్రనాథ్, సహాయ కార్యదర్శి రామనాథం పూర్ణచంద్రరావు, వంగర పెద లక్ష్మయ్య, బిట్రా భాస్కరరావు, మంగళగిరి సాహితీ కళావేదిక సభ్యులు తాటిపాముల లక్ష్మీ పెరమాళ్ళు, గోలి మోహన్రావు (పాలసంటి)శలా సత్యనారాయణ, కౌతరపు రామచంద్రరావు, కౌతరపు కవిత, రేఖ నరేష్, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, అలుగురి రాజశేఖర్, తిరుమల శెట్టి హనుమంతరావు, కొడాలి కామేశ్వరరావు, తుమ్మ సర్వేశ్వరరావు, మునగపాటి సీతారామాంజనేయులు, అలుగూరి శివ నాగరాజు, అవ్వారు బుజ్జి, అవ్వారు నవీన్, మంద్రూ శ్రీను,గుత్తికొండ నాగేశ్వరరావు, అలుగూరి జయశ్రీ, అవ్వారు సాయిలక్ష్మీ, అవ్వారు రామకృష్ణ,గుత్తికొండ దినేష్ ,కౌతరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు







## డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆరోగ్య పరిరక్షణే తమ ధ్యేయమని ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం జొన్నలగడ్డ గ్రామంలో అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ, సంబంధిత సమస్యలు, అలాగే ఇతర సమస్యలతో బాధపడుతున్న సుమారు 250 మంది స్త్రీ పురుషులు ఈ శిబిరాన్ని ఉపయోగించుకున్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలోని పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు వేసవికాలం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తల్లి, బిడ్డ క్షేమంగా గురించి సులువు ప్రసవం అయ్యే మార్గాలు, గురించి వ్యాయామం, తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు తల్లి తీసుకోవాల్సిన వ్యాక్సినేషన్ గురించి అవగాహన కల్పించారు. వైద్య పరంగా పేద ప్రజలకు ప్రభుత్వాలు చేస్తున్న సేవలలో భాగంగా తమ వంతు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శనక్కాయల రాజకుమారి, డాక్టర్ కరీమా, డాక్టర్ లిఖిత, జొన్నలగడ్డ సర్పంచ్ సుధాకర్, వైస్ సర్పంచి శ్రీనివాసరావు, వెంకట్రావు, శివ గంగయ్య, మల్లీ అహల్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్‌పై బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు : చీఫ్ విప్ జీవీ

## వినుకొండ, రవ్వారంలో రేషన్ పంపిణీలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ, మక్కెన





**వినుకొండ మేజర్ న్యూస్ :** పేద ప్రజలకు మేలు చేసేలా ఇకపై రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, అవసరమైన సమయాల్లో ఇతర నిత్యావసరాలు కూడా రాయితీపై అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. కొత్త కార్డుల కోసమైనా, మార్పుల కోసమైనా చివరి తేదీ ఏం లేదని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. వినుకొండ సట్టు బజారు, నూజండ్ల మండలం రవ్వారంలో ఆదివారం జరిగిన రేషన్ పంపిణీ కార్యక్రమంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. రేషన్ దుకాణాలను ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఇదే పని గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ వ్యాన్‌ల పేరుతో కాకినాడ పోర్టుకు బియ్యం స్మగ్లింగ్ చేశారు తప్ప ప్రజల అవసరాలుగు ర్తించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. జగన్ రెడ్డి తెచ్చిన రేషన్ వాహనాల కారణంగా ప్రభుత్వానికి నెలకు రూ. 1,800 కోట్లు, ఏడాదికి రూ. 21,600 కోట్ల ఖర్చు అవుతుందన్నారు. ఇకపై వ్యాన్ కోసం ఎదురుచూడటం, వీధి చివర నుంచోవటం, సెలవులు పెట్టి అదెప్పుడు వస్తుందా? అని ఎదురుచూడాల్సిన పరిస్థితి అవసరం లేదన్నారు. బియ్యం రవాణా వాహనాలపై లబ్ధిదారుల్లో తీవ్ర అసంతృప్తిని గుర్తించే సీఎం చంద్రబాబు వాటిని తొలగించారన్నారు. పైగా నెలకు 2 రోజులే నిత్యావసరాలు ఇచ్చే వ్యవస్థను రద్దు చేసి ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లోనూ ఎప్పుడు కావాలంటే అప్పుడు రేషన్ దుకాణాలకు వెళ్లి సరకులు తెచ్చుకునే విధంగా చర్యలు చేపట్టారన్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ డిపోలన్నీ తెరిచే ఉంటాయన్నారు. దోపిడీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయడమే తమ లక్ష్యమని, ప్రభుత్వం తరపున చేసే ప్రతి పని, ఖర్చు పెట్టే ప్రతి పైసా ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చాలన్నదే సీఎం చంద్రబాబు ఏకైక ఆశయమని పేర్కొన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు రేషన్ డీలర్లే వారి ఇళ్లకు వెళ్లి నిత్యావసరాలు అందిస్తారన్నారు. సీఎం చంద్రబాబు మరో కీలక సంస్కరణ తెస్తున్నారని, బియ్యం కావాలంటే బియ్యం, డబ్బులు కావాలంటే డబ్బులు తీసుకునే మార్పు రాబోతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని ప్రజలంతా అభినందించడంతో పాటు హర్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షలమంది రేషన్ కార్డుదారులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ డాక్టర్ దాస్తగిరి షకీలా. టిడిపి పట్టణ అధ్యక్షులు పి అయుబ్ ఖాన్. షమీం. కూటమి నేతలు. రాయల్ నాగ శ్రీను. జానీ. తాసిల్దార్ సురేష్ నాయక్. డిటి మురళి. ఆర్ ఐ శ్రీహరి. డీలర్ సంగమేశ్వర రావు. తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట మేజర్ న్యూస్**

నరసరావుపేట నియోజకవర్గంలో పట్టణం మరియు రొంపిచర్ల మండలంలో నరసరావుపేట శాసనసభ్యులు డా”చదలవాడ అరవింద బాబు పర్యటించారు పలు గ్రామలు వార్డులలో ప్రభుత్వ రేషన్ చౌక దుకాణాలు పునఃప్రారంభించారు చౌక దుకాణాలలో వసతులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ బీజేపీ సమన్వయకర్త రంగిశెట్టి రామకృష్ణ పీడీ ఎమ్మార్వో సంబంధిత అధికారులు మరియు టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.




# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

**మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని మంగళగిరి రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్ అన్నారు. ఆదివారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు ఎలాంటి గొడవలకు, భూదందాలకు పాల్పడరాదన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, దౌర్జన్యాలకు, అసాంఘిక చర్యలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, పాల్పడకూడదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్వేషాలు సృష్టించకుండా ఉండాలని, అన్ని వివాదాలకు దూరంగా ఉండాలని, అలా కాకుండా గొడవలు సృష్టించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే పిడి యార్టు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా రౌడీషీటర్లు భూ దందాలకు, అసాంఘిక చర్యలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**తెనాలి, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా తెనాలి పట్టణంలోని కొన్ని ప్రాంతాలో సోమవారం విద్యుత్ కోత విధించనున్నట్లు డివిజనల్ డిప్యూటీ ఇంజనీర్ బి.అశోక్ కుమార్ తెలిపారు. పట్టణ పరిధిలోని గాంధీ చౌక్, ప్రకాశం రోడ్డు, రజక చెరువు ప్రాంతాలలో పాటు రూరల్ పరిధిలోని అంగలకుదురు, చావావారిపాలెం, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొత్త ఉంటుందని వినియోగదారులు సహకరించాలని డిప్యూటీ ఇంజనీర్ అశోక్ కుమార్ తెలిపారు.

## మంగాపురం సిపిఐ కార్యదర్శిగా గంగాధర్




**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల మండలం పెదఅగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలోని మంగాపురం క్యాంపు సిపిఐ కార్యదర్శిగా రామిరెడ్డి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం మంగాపురం క్యాంపు నందు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ పాల్గొన్నారు. రామిరెడ్డి గంగాధర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షేక్ హుస్సేన్ మాట్లాడుతూ, పేద ప్రజలకు అండ ఎర్రజెండా అని హుస్సేన్ అన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి, ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని హుస్సేన్ అన్నారు. మందపాటి రమణారెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరకు నివేసి స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం మంగాపురం క్యాంపు సిపిఐ కార్యదర్శిగా రామిరెడ్డి గంగాధర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అక్కినపల్లి బాలయ్యతో పాటు షేక్ కరీముల్లా, ఏ కృష్ణయ్య, సిహెచ్ లక్ష్మీ సరిత, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు కార్యాలయంలో ప్రభు చందు సన్మాన సభ




**పెదకాకాని మేజర్ న్యూస్ :** సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం కుక్కల ప్రభు చందు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కుక్కల ప్రభు చందు ఎంతో పేదరికం నుండి కష్టపడి పెదకాకాని హైస్కూల్ నుండి ప్రారంభమైన చదువు విజ్ఞాన యూనివర్సిటీ లో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఝూర?ండ్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ధన్బాదు నుండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ధన్బాద్, పిహెచ్డి పట్టా పొందారని తెలిపారు. పీహెచ్డీ పట్టా పొందటం చాలా సంతోషంగా ని అన్నారు అనంతరం కుక్కల ప్రభు చందుకి సన్మానం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోటిపల్లి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.బాబురావు, వల్లంగులు శివయ్య, బురదగుంట సాంబయ్య, ఆర్. వెంకటేశ్వర్లు,వాళ్ళ కుటుంబ సభ్యులు,సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

## జులై 5న జాతీయ లోక్ అదాలత్

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు జులై 5న (ఒకటవ శనివారం) మండల న్యాయ సేవాధికార సంస్థ, పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో స్థానిక సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) టి.ప్రవల్లిక నేడు ఒక ప్రకటన తెలియజేసినారు. కావున పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ జాతీయలోక్ అదాలత్ నందు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు (ముందస్తు వాయిద్యములు) తదితర కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు. తద్వారా కక్షిదారులకు ధనము, ఆదా ఆవుతోందని తెలియజేశారు. జులై 5న (ఒకటవ శనివారం) న పిడుగురాళ్ల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ జరుగును. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవలసిందిగా కోరడమైనదని ఒక ప్రకటన లో తెలిపారు.

## ఓణీల వేడుకలలో పాల్గొన్న అంబటి మురళి కృష్ణ




**పెదకాకాని మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉప్పలపాడు మనకి చెందిన వలస పక్షుల కేంద్రం మాజీ చైర్మన్ పెరుమాళ్ళ అనిల్ కుమార్ కుమార్తె ఓణీల బహుకరణ వేడుకలలో ఆదివారం పొన్నూరు నియోజకవర్గ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త అంబటి మురళి కృష్ణ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీ చేసిన తహశీల్దార్ సునీత



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన నిత్యవసర సరుకులను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తహశీల్దార్ అన్నారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి మండల మండలంలోని రేవేంద్రపాడు, శృంగారపురం గ్రామాల్లోని రేషన్ దుకాణా. ల.ను పున ప్రారంభించారు. తగనంతరం రేషన్ షాపుల నుండి నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 8 నుంచి 12:00 వరకు సాయంత్రం నాలుగు నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు పని చేస్తాయని, షాపుల ద్వారా నిత్యవసర సరుకులను పొందవచ్చునని అన్నారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు అవకాశం ఉన్న సమయాల్లో రేషన్ తీసుకునే వెసులుబాటును ప్రజలకు కల్పించామని తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు సునీత వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొప్పుల మధు, సర్పంచులు కొండూరు సుధారాణి,పి. మెరిమ్మా, వీఆర్వోలు బి. శ్రీనివాసరావు, బుల్లెమ్మాయి, గ్రామ పార్టీ అధ్యక్షులు అంకమయ్య, ఎం.చంద్రశేఖర రావు, కె.జస్వంత్, జూపల్లి. వెంకటేశ్వరరావు, ఏ. శంకర్ ,డీలర్లు రోజా, వై. లక్ష్మీ ,హేమలత ,కే .వాసు బాబు ,తదితరులు పాల్గొన్నారు..

## నేడు విద్యుత్తుకు అంతరాయం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** విద్యుత్తు లైన్లు మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్తుకు అంతరాయము కలుగునని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఖాన్ ఆదివారం తెలియజేసినట్లు పెదకాకాని ఏపీ సిపిడిసిఎల్ బ్రహ్మయ్య తెలిపారు. పెదకాకాని పాత తాసిల్దార్ కార్యాలయం రోడ్డు, యాదవపాలెం, నాయుళ్ళ బజార్, జాన్ ఆస్పర్ కాలనీ, ఎస్టీ కాలనీ, పుష్పరాజ్ కాలనీ, పాతూరు ఏరియా, శివాలయం పరి సరాలు సోమవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయ కలుగునని, వినియోగదారులందరూ సహకరించగలరని తెలిపారు.

# వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గం అభివృద్ధి : ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** గురజాలనియోజకవర్గంలో అభివృద్ధి పనులకు కాను రూ. 1200ల కోట్ల రూపాయలు, రూరల్ ఏరియాలో రూ.600ల కోట్లు రూపాయలతో నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు మంజూరు అయ్యాయి. ఆగస్టులో నూతన మునిసిపల్ ఆఫీసును పూర్తి చేస్తామన్నారు. అయితే దాన్ని కూడా లోన్ పెట్టుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీ పనులు 90 శాతం పూర్తయిందని, పూర్తి చేశామని, ఆర్ ఓ బి పనులు కూడా మేమే చేసామని చెప్పటం సిగ్గుచేటున్నారు. ప్రస్తుతం ఆర్ఓబికి మెటీరియల్ వచ్చిందని త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గడిచిన 5 సంవత్సరాల కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉన్న సమయంలో నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. వైసీ ప్రభుత్వ%శీ% టైంలో ఏ విధమైన నిధులు మంజూరు కాలేదని ఆయన అన్నారు. రోడ్లు కాలువలు రిపేర్ చేయుటకు రెండున్నర కోట్లు నిధులు తెలుగుదేశం ప్రభుత్వం వెచ్చించారన్నారు. డీఎంఎఫ్ ఫండ్ నుంచి రూ.10 కోట్ల 70 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు వీటిని వివిధ వర్గాల కమ్యూనిటీ హాళ్ళకు, ఆరో ప్లాంట్లకు, వివిధ కార్పొరేషన్ల కమ్యూనిటీ హాళ్ళకు ఇవ్వటం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం కాలంలో రోడ్లు గుంతల మయంగా కాలువలు రిపేర్లు చేయక చివర భూములకు సాగు నీరందని పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల ముందు ఎన్నికల తరువాత వైసీపీ ప్రభుత్వం కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తుందని ఆరోపించారు. ఎలక్షన్లు అయిన పిదప కూడా నేర ప్రవృత్తితో మార్పు రాకపోవడం సిగ్గుచేటు అన్నారు. వైసీపీ లాగా తాము అధికారంలోకి వచ్చినప్పటికీ ఏ విధమైన దాడులు వైసీపీ నాయకుల మీద గాని కార్యకర్తల మీద చేయలేదన్నారు. కానీ గురజాల నియోజకవర్గంలో చిత్రమైన పరిస్థితి జరుగుతుందన్నారు. తంగెడ, పిన్నెల్లి, తుమ్మలచెరువు, రేగులగడ్డ , తురకపాలెం తదితర గ్రామాలలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపైనే దాడులు చేశారన్నారు. వైసీపీ నాయకులు తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నప్పటికీ తాము కక్ష సాధింపుకు వెళ్ళటం లేదన్నారు. జరగాల్సిన పనులు చట్ట ప్రకారమే జరుగుతాయని వైసీపీ నేతలకు గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడులకు సమాధానం చెప్పవలసిన బాధ్యత వైసీపీ పై ఉందన్నారు. గురజాల నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు కలసిమెలసి జీవించాలన్నదే తమ అభిమతం అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తామని అందుకు అన్ని పార్టీల నాయకులు,ప్రజలకు సహకార అందించాలని కోరారు.

# నాణ్యమైన నిత్యావసరాలను పంపిణీ చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### మంగళగిరిలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన కూటమి నాయకులు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని నగరంలోని 11వ షాపు లో కూటమి నాయకులు ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ కార్డు దారులకు కూటమి నాయకులు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావులు మాట్లాడుతూ నాణ్యమైన నిత్యావసర సరుకుల పంపిణీయే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు. ప్రజల కోరిక మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థను పునరుద్ధరణ చేసి పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇకపై ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ డీలర్లు దుకాణాల వద్ద రేషన్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి తహశీల్దార్ రాఘవేంద్ర దినేష్ కుమార్, మంగళగిరి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 30,31 వార్డుల్లో జరిగిన కార్యక్రమంలో తెలుగు మహిళా మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షురాలు ఆర్రుద భూలక్ష్మి రేషన్ సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు చిల్లెం అవినాష్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని కొత్తపేటలో మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర సరుకుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడిలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ రేషన్ డిపోను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ తోట పార్థసారథి, టిడిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఆకుల జయసత్య రేషన్ డిపోలను ప్రారంభించి పేదలకు రేషన్ సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, మల్లవరపు వెంకటరావు, నీలం అంకారావు, ఆకుల పానయ్య, గడదాసు రంగారావు ఫిరోజ్ , కర్నాటి శివ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. నవులూరులో జరిగిన రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోట పార్థ సారథి, ఆకుల జయసత్య. మల్లవరపు వెంకటరావు, వేమూరి మైనర్ బాబు, తోట శ్రీను, కొల్లి వెంకటరామయ్య చావలి ఉల్లయ్య మట్టుకొయ్య అశోక్, కట్టేపోగు ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీ హర్షణీయం : తిరుమలశెట్టి కొండలరావు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ అసమర్ధ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడిందని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు విమర్శిం చారు. ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయడం వల్ల ప్రభుత్వంపై రూ. వందల కోట్లలో భారం పడిందని అన్నారు. తిరిగి పాత పద్ధతి లో రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయటం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఆదివారం రేషన్ డిపోల ద్వారా సరుకులను పంపిణీ కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీకి గత వైసీపీ ప్రభుత్వం సుమారు రూ.1,700 కోట్ల రూపాయలు వెచ్చించిందని తెలిపారు. పోనీ అంత వెచ్చించినప్పటికీ రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేశారా అంటే అది లేదని, ఎక్కడో వీధి చివర ఉంటే అక్కడకు వెళ్లి కార్డుదారులు వేచి ఉండి సరుకులను తెచ్చుకోవాల్సి వచ్చేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి చెప్పిందని పేర్కొన్నారు. పాత పద్ధతి లోనే రేషన్ డిపోల ద్వారా సరుకుల పంపిణీ చేపట్టడం సంతోషించదగ్గ విషయం అని అన్నారు. కార్డుదారు లకు నాణ్యమైన సరుకులను అందజేస్తారని తెలిపారు. నెలలో 15 రోజులు పాటు రేషన్ డిపోల ద్వారా సరుకు లను పంపిణీ చేస్తారని అంతే కాకుండా దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులను చేరవేస్తారని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్న పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కు, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు కొండలరావు ధన్యవాదాలు తెలిపారు.

# తెదేపా హయాంలోనే ఇరికేపల్లి గ్రామం అభివృద్ధి





దాచేపల్లి మేజర్ న్యూస్ : మండలంలోని ఇరికేపల్లి గ్రామం నందు శ్రీ అంకమ్మ తల్లి 15వ వార్షికోత్సవ తిరుణాళ్ళ మహోత్సవం కార్యక్రమంలో ఆదివారం రాత్రిముఖ్యఅతిథిగా గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇరికేపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భారీ ర్యాలీతో పూలమాలలతో, టపాసులు కాలుస్తూ, డీజేలతో ఆయనకు ఆహ్వానం పలికారు. ముందుగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు . అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, వై నాట్ 175 అని విర్రవీగిన వైసిపి ప్రభుత్వం 11 సీట్లకు అంకితం అయిందని , అక్కడ కడప ఇక్కడ

- గురజాల ఎమ్మెల్యే శ్రీనివాసరావు వెల్లడి
- భారీ ర్యాలీ టపాసుల డీజేతో యరపతినేనికి ఆహ్వానం
- అంకమ్మ తల్లి 15వ తిరునాళ్లలో పాల్గొన్న యరపతినేని


ఇరికేపల్లి గ్రామంలో అహంకారంతో విర్రవీగి ఓటమి పాలయ్యారని ఎద్దేవా చేశారు . నేను అధికారంలో ఉన్న 2014 - 2019 వరకు ఇరికే పల్లి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తప్ప, గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి చేసింది ఏమీ లేదని , పేరు గొప్ప ఊరు దిబ్బలాగా గొప్పలు చెప్పుకోవడం తప్ప ఎక్కడ కూడా తట్ట మట్టి చేసి గ్రామాన్ని అభివృద్ధి చేసిన దాఖలు లేవని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టిన వాళ్ళకి శిక్ష తప్పదని హెచ్చరించారు. నేను అధికారంలో ఉన్నప్పుడు కోటి 20 లక్షల రూపాయలతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద సిసి రోడ్లు పూర్తి చేశామని, ఇరికేపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో నేనెప్పుడూ ముందుంటానని, గ్రామానికి ఏది కావాలన్నా చేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ బద్రి, వేముల తిరుమల కుమార్, జెక్కిశెట్టి పున్నారావు, వేముల వినోద్ రెడ్డి, ఈదా నరసింహారెడ్డి, ఈదా నర్సిరెడ్డి, తుమ్మూరి సూధకర్ రెడ్డి, ఈమని రామకృష్ణ రెడ్డి, పత్రా విజయ్ కుమార్, పత్రా ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి 6వరకు ఆయుర్వేద వైద్యులకు నేషనల్ లెవెల్ సెమినార్



గుంటూరు మేజర్ న్యూస్ : గుంటూరులోని పొత్తూరు నందు విశ్వాయుర్వేద పరిషత్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీ (సోమవారం )నుండి 6వ తారీకు వరకు అనేక అంశాలమీద వైద్యులకు, 3వ ఆయుర్వేద కౌశలం 2025 ఆయుర్వేద వైద్యులకు నేషనల్ లెవెల్ సెమినార్ రక్షణ కార్యక్రమం స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల చైర్మన్ చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ కె ఎస్ ఎన్ గోపాలన్ పేర్కొన్నారు. సాలిపేటలో గల స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాలలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బి.ఏ.ఎం.ఎస్, ఎం. డి (ఏవై) ఆయుర్వేద విద్యార్థులకు శిక్షణ, హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతున్నది అని దీనికి దేశం నలుమూలల నుండి వైద్యులు వస్తున్నారని డాక్టర్ కేఎస్ఎన్ గోపాలన్ చీఫ్ ఫిజీషియన్ స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల చైర్మన్ తెలిపారు. (1)శాలక్య (ఆయ్యుర్వదిక్ ఈ. ఎన్. టీ ) 2)పంచకర్మ, 3)శల్య చికిత్స (ఆయుర్వేదిక్ సర్జరీ )4)గర్భచికిత్స (ఇంఫర్టిలిటీ )5)మర్మ చికిత్స 6)నాడిచికిత్స 7)బి ఎల్ ఎస్(బేసిక్ లైఫ్ సపోర్ట్ )8)మోడరన్ డైగ్నోస్టిక్ టూల్స్ యూస్ ఇన్ ఆయుర్వేద 9)%చీూదీ౨% ఇన్ ఆయ్యుర్వదిక్ హాస్పిటల్ 10)నీట్ పి. జి అండ్ ఏపీ పి పి ఎస్సీ ఎగ్జామ్స్ ప్రేపరషన్ 11)అంటిజం, ఏ డి హెచ్ డి ట్రీట్మెంట్ ఇన్ ఆయుర్వేద 12)కన్స్యూమర్ ఆక్ట్స్ ఇన్ ఆయుర్వేద 13)క్యాన్సర్ చికిత్స ఆయుర్వేద మొదలగు వాటి మీద శిక్షణ, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని వారు వెల్లడించారు. ఈవిలేకరుల సమావేశంలో స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సూపరింటెండెంట్ , డాక్టర్ చైతన్య ప్రెసిడెంట్ మాధవ డాక్టర్ మాధవరావు చౌదరి విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సాహితి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.వి.ఆర్.లో విపత్తుల నిర్వహణపై శిక్షణ



గుంటూరు, మేజర్ న్యూస్ : విపత్తు సమయాల్లో ధైర్య సాహసాలతో ప్రజలను రక్షించే విధంగా ఎన్ సి సి విద్యార్థులు తయారవ్వాలని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్ పేర్కొన్నారు. గుంటూరు శివారు చౌడవరం లోని ఆర్ వి ఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాలలో 10 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుండి జరుగుతున్న కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ - 1 శిక్షణ తరగతులలో భాగంగా రెండు రోజుల పాటు ఎన్. సి. సి క్యాడేట్లకు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం విపత్తు నిర్వహణపై ప్రత్యేక శిక్షణను అందించారు. ఈ శిబిరంలో కేడెట్లు విపత్తు నిర్వహణ, భద్రతా చర్యలు, ప్రాథమిక సహాయ చికిత్స మరియు రక్షణ పద్ధతులపై అవగాహన పొందారు. ఎన్.డి.ఆర్.ఎఫ్ అధికారులు ప్రాక్టికల్ డెమోస్, మాక్ డ్రిల్స్ ద్వారా విద్యార్థులకు శిక్షణ అందించారు. ఎన్.సీ.సి విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు అవుతూ తమదంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసుకోవాలని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. పేర్కొన్నారు. గతంలో అనేక సమయాల్లో, పలుచోట్ల సంభవించిన విపత్తు పరిణామాల్లో సహాయక చర్యల్లో తమ కళాశాల ఎన్. సి.సి విద్యార్థులు చురుకుగా పాల్గొనడం జరిగిందని కళాశాల సెక్రటరీ %ఽ% కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులకు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, అకడమిక్ అండ్ ఆర్‌డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ & అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి.శ్రీనివాసరావు మరియు కళాశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశి పట్వాల్, క్యాంపు సీనియర్ జెసిఓ ఇమాం సాహెబ్ షేక్, క్యాంపు ట్రైనింగ్ జెసిఓ రాజు, క్యాంపు క్వార్టర్ మాస్టర్ జెసిఓ సూర్యకాంత్, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర బాబు, కళాశాల ఎన్సిసి అధికారులు డా. తారాచంద్, డా. ఉషా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై వేస్తున్న పన్నుల బారాలపై పోరాటం : నేతాజీ



మంగళగిరి, మేజర్ న్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న పన్నుల బారాలపై పోరాటం చేస్తామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. మంగళగిరి సిపిఎం కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణ పార్టీ సభ్యుల, సానుభూతిపరుల విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య అధ్యక్ష వహించారు. నేతాజీ మాట్లాడుతూ గుంటూరు, మంగళగిరి, ప్రకాశం, కృష్ణాజిల్లాలలో ఉన్న విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్లు బిగించి భారం మోపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రభుత్వ ప్రయత్నాన్ని ప్రజలను సమీకరించి ఎదుర్కొంటామని అన్నారు. ఇటీవల కాలంలో ఆస్తి పన్ను భారీగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని విమర్శించారు. ఇంటి ఇల్లు ఆధారంగా పనులు పెంచే విధంగా చర్యలు చేపట్టారని విమర్శించారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బగిస్తే పగలగొడతామని చెప్పిన మంత్రి నారా లోకేష్ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించడానికి అనుకూలంగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారిన రాష్ట్రంలో విధానాలు మారలేదని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. బిజెపికి సొంతంగా బలం లేకపోయినప్పటికీ దూకుడు మాత్రం తగ్గలేదని విమర్శించారు. బిజెపి పాలనలో శతకోటీశ్వరుల సంఖ్య రెట్టింపు పెరిగిందని అన్నారు. ఒక శాతం ప్రజల్లో 40% ఆదాయం ఉందని, పేదలైన 50% ప్రజల్లో మూడు శాతం మాత్రమే ఉందని అన్నారు. ఆర్థిక అసమానతలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతుందని అన్నారు. సెస్‌ల పేజరుతో ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. అమెరికా ఆధిపత్యం పెంచుకోవడానికి చూస్తుంది గానీ, అమెరికాలో ఆర్థిక సంక్షోభం పెరిగిపో తుందని అన్నారు. అందువలన రష్యా ఉక్రెయిన్ మధ్య జరిగే యుద్ధాన్ని ఆపాలని ట్రంప్ చూస్తున్నారని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్‌లాల్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు మంగళగిరి పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇళ్లు వేసుకొని నివాసం ఉంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తాగునీరు సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం శాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపిన ఎక్సైజ్ అధికారులు



ఈపూర్ మేజర్ న్యూస్ : ఈపూర్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజు స్టేషన్ పరిధిలో వున్న మద్యం దుకాణాలలో మే నెలలో ఇన్స్పెక్షన్‌లు నిర్వహించి మద్యంను ల్యాబ్ కు పంపి పరీక్షించు నిమిత్తం మొత్తం 07 శాంపిల్‌లు తీయడం జరిగింది. అలాగే ఈ సంవత్సరంలో మే నెల చివరి వరకు అక్రమంగా మద్యం కలిగివున్న(బెల్ట్ షాపు) వారి మీద 30 కేసులు నమోదు చేయడం జరిగింది. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి మీద 07 కేసులు నమోదు చేయడం జరిగింది. కల్లు లో ఎటువంటి కల్తీ జరగకుండా నివారించడం కోసం 06 కల్లు శాంపిల్ లు తీసి రసాయనిక పరీక్షకు పంపడం జరిగింది. కేసులులో వున్న 30 మందిని తహసీల్దారు ల వద్ద బైండోవర్ చేయడం జరిగింది. అలాగే నవోదయం 2 లో భాగంగా నాటు సారాయి నిర్మూలనకి గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగింది. సదరు గ్రామకమిటీలు బ్రిడ్జి తండా, బోడిపాలెం తండా, ఇనమీడ తండా, గండిగనుమల గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించుటకు తమ అంగీకారం తెలుపడం జరిగింది. మద్యం దుకాణాలు టైమింగ్స్ ను తనిఖీ చేయుటకు సిబ్బందికి డ్యూటీ వేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రభుత్వం మద్యం దుకాణాలు వద్ద క్యూ.ఆర్ సర్వే ఏర్పాటు చేసి మద్యం వినియోగదారుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతుంది. ఈపూరు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజు సర్కిల్ పరిధిలో నాటు సారాయి, అక్రమ మద్యం, కల్తీ కల్లు, మాధక ద్రవ్యాలు మొదలగు నేరముల గురించి ఎలాంటి సమాచారం వున్నా తెలుపగలరు. తెలిపిన వారి వివరాలు గొప్యం గా ఉంచడం జరుగుతుంది అని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు.

## పేరూరుపాడులో ప్రతిష్టాత్మకంగా రేషన్ పంపిణీ



**బొల్లాపల్లి మేజర్ న్యూస్ :** మండలంలోని పేరూరుపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న షాపుల వద్దనే రేషన్ పంపిణీ విధానంలో భాగంగా ఆదివారం రేషన్ షాప్ ని ఓపెన్ చేయడం జరిగినది . కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకొని విజయవంతం చేయాలని సూచించారు. దీనిపై ఎటువంటి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరుకోరారు.కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లాపల్లి మండల,మాజీ తెలుగు యువత అధ్యక్షులు బొప్పూడి.శ్రీనివాస్, యూనిట్ ఇంచార్జ్ కాసరగడ్డ హనుమంతరావు సీనియర్ నాయకులు పోకా శ్రీనివాసరావు,కాట్ల వెంకటేశ్వర్లు,డీలర్లు శీలం ఐతన్న,షేక్ రహీం తదితరులు పాల్గొని లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయడం జరిగింది



# మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహిద్దాం

### గుంటూరులో అవగాహన మారథాన్ నిర్వహణ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

మాదకద్రవ్యాల నియోగం వల్ల కలిగే అనార్థాలు గురించి అవగాహన పెంచడానికి మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి నాషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ తెలిపారు. ఆదివారం నాషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా నిషేధిత మాదకద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కోసం నిర్వహించిన మినీ మారథాన్ ను జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కోసం జూన్ 1 నుంచి 26వ తేదీ వరకు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు ముఖ్యంగా యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా యువతను భాగస్వామ్యం చేస్తూ మినీ మారథాన్, ర్యాలీలు. సెమీనార్ లు, వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత మాదకద్రవ్యాల



వినియోగాన్ని అరికట్టేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. పోలీస్ శాఖ ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా అవగాహనతో పాటు ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. పోలీస్ , రెవిన్యూ, ఎక్సైజ్, వైద్యారోగశాఖ, విద్యాశాఖ తదితర శాఖలన్ని నిషేధిత మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంతో పాటు వ్యసనాలకు బానిసైన అయిన వారికి డీఎడిక్షన్ సెంటర్లో చికిత్సను అందిస్తున్నారన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు భారత ప్రభుత్వం, సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ 2020 నుంచి నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు.




దీనిలో భాగంగా జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్జాపించేందుకు జూన్ 1 నుంచి 26వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా యువతకు వాటి వల్ల కలిగే అనర్థాలపై పోలీస్ శాఖ , ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన మినీ మారథాన్ నగరంపాలెం, మూడు బొమ్మల సెంటర్ మీదుగా హిందూ కళాశాల సర్కిల్ వరకు కొనసాగింది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే నష్టాలను వివరిస్తూ మినీ మారథాన్ లో పాల్గొన్న యువకులు, ఉద్యోగులు ప్లే కార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి సువార్త, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ కల్యాణి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.

ఫ్రం... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) – బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు – గుంటూరు జిల్లా ఇన్‌చార్జి – సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) – స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
ఎం.ఏడుకొండలు – సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి – సెల్ : 9030880455
జి.హిరణ్మాయి(కన్నల్) – నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి, జిల్లా క్రైమ్ రిపోర్టర్
ఆళ్ల వీరభద్రరావు(భద్రం) – గుంటూరు జిల్లా క్రైం రిపోర్టర్ – సెల్ : 9848411984
చెట్టిపోగు కాశి – దాచేపల్లి రిపోర్టర్ – సెల్ : 9963343327
శేషగిరి రాజు – మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి – సెల్ : 8341408201
వై.ఏసుబాబు – గురజాల ఆర్సీ ఇన్‌చార్జి – సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు – సత్తెనపల్లి రిపోర్టర్ – సెల్ : 9866246951
చెవుల రంగారావు – మెడికల్ రిపోర్టర్, గుంటూరు – సెల్ : 9490544635
యం.కృష్ణ – మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి – సెల్ : 9393309149
వి.రవికుమార్ – తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి – సెల్ : 99083 38200
డి. చైతన్య – వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి – సెల్ : 9381968453
ఎస్.కె.రఫీ – చిలకలూరిపేట ఆర్సీ ఇన్‌చార్జి – సెల్ : 99493352147
జి.ఏలియా – ముప్పాళ్ళ రిపోర్టర్ – సెల్ : 9392231959
బి.సాంబశివరావు – రాజుపాలెం రిపోర్టర్ – సెల్ : 9949382676
రమేష్ – దుగ్గిరాల రిపోర్టర్ – సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు – పెదకాకాని రిపోర్టర్ – సెల్ : 9948175840
కె.నాగరాజు – రిపోర్టర్, గుంటూరు – సెల్ : 7799881000
డి.రమేష్ – ఈపూరు రిపోర్టర్ – సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ – నూజెండ్ల రిపోర్టర్ – సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ – శావల్యాపురం రిపోర్టర్ – సెల్ : 7989434737
అక్కిరెడ్డి – నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ – సెల్ : 9849134987
లక్ష్మీనారాయణ – రెంటచింతల రిపోర్టర్ – సెల్ : 800079075
వి.వెంకటరెడ్డి – బొల్లాపల్లి రిపోర్టర్ – సెల్ : 80191 99991
పి.వెంకటేశ్వర్లు – దుర్గి రిపోర్టర్ – సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ – వెల్దుర్తి రిపోర్టర్ – సెల్ : 9912818723
ఎస్.విజయభాస్కర్ – గుంటూరు రిపోర్టర్ – సెల్ : 9440822538
షేక్ నాగూర్ – నకరికల్లు రిపోర్టర్ – సెల్ : 98489 26300
ఎం.కోటేశ్వరరావు – మాచవరం రిపోర్టర్ – సెల్ : 6303775169
సి.హెచ్.ప్రసాద్ – గుంటూరు సిటీ రిపోర్టర్ – సెల్ : 8125309319
పి.ఆనంద్ – వినుకొండ రూరల్ రిపోర్టర్ – సెల్ : 8125125239
జి.బాలాజీ – తాడికొండ రిపోర్టర్ – సెల్ : 9603424824
రమేష్ – నరసరావుపేట రూరల్ రిపోర్టర్ – సెల్ : 7075942600
తేళ్ల రవీంద్రబాబు – గుంటూరు రిపోర్టర్ – సెల్ : 7396234032
డి.మల్లికార్జునరావు – యడ్లపాడు రిపోర్టర్ – సెల్ : 8309237441

"నేటి దినపత్రిక సూర్య"
ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.